జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కలిసిన కలెక్టర్



నిజామాబాద్ అర్బన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన టి.వినయ్ కృష్ణారెడ్డి ఆదివారం హైదరాబాద్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిశారు. జ్యోతిబా పూలే ప్రగతిభవన్‌లో మంత్రిని కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వినయ్ కృష్ణారెడ్డిని సీతక్క అభినందించారు.



నర్సింగ్‌పల్లిలో శ్రీనివాసుని కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా శ్రీనివాసుని కల్యాణోత్సవం



నర్సింగ్‌పల్లి ఆలయంలో స్వామివారి విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

నిజామాబాద్ కల్చరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఏడు కొండల వాడ వెంకటరమణ గోవిందా... గోవిందా... శ్రీనివాస గోవిందా... గోవిందా.. అంటూ భక్తుల గోవింద నామస్మరణలతో శ్రీనివాసుని కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. పండితుల వేద మంత్రోచ్చారణలు, అర్చకుల కల్యాణతంతుతో శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. నర్సింగ్‌పల్లి ఇందూరు తిరుమల ఆలయంలో నిర్వహించిన కల్యాణ వేడుకల్లో సేనాపతి సంపత్‌కుమారాచార్య వేదమంత్రాలు పఠించగా అర్చకులు రోహిత్‌కుమారా ఆచర్య కల్యాణ తంతును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు విజయ్‌స్వామి, రంగీలా అనీల్ స్వామి, పాల్గొన్నారు. అదేవిధంగా ఆర్యనగర్ వెంకటేశ్వరస్వామి ఆలయం, చక్రంగుడి వెంకటేశ్వరస్వామి, జెండా బాలాజీ ఆలయంలో అర్చకులు నాగ రాజచార్య కల్యాణ వేడుకలను కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణ అధికారి వేణు, జూనియర్ అసిస్టెంట్ ప్రశాంత్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



నగరంలోని చక్రం గుడిలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఎస్సారెస్పీపైనే రైతుల ఆశలు





- వానాకాలంలో భారీగా సాగుకు సిద్ధమవుతున్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు రైతులు
- ప్రాజెక్టు పరిధిలో ప్రతియేడు రెండు పంటలకు అందుతున్న సాగునీరు
- ఈయేడు కూడా కాకతీయ, సరస్వతి, లక్ష్మి కాల్వల పరిధిలో భారీగా సాగు కానున్న వరి

నిజామాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉత్తర తెలంగాణ ఆయకట్టు రైతులు శ్రీరాంసాగర్ ప్రాజెక్టుపైనే ఆశలు పెట్టుకున్నారు. భారీ వర్షాలు పడితే పెద్ద ఎత్తున సాగుకు సన్నద్ధమవుతున్నారు. గత కొన్నేళ్లుగా రెండు పంటలకు ప్రాజెక్టు నుంచి సాగు నీరు అందుతుండటంతో ఈ వానాకాలంలో కూడా భారీ విస్తీర్ణంలో పంటలు వేసేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే ప్రాజెక్టు ఆయకట్టు ప్రాంతంలో నారుమళ్లను సిద్ధం చేసిన రైతులు భారీ వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రాజెక్టులోకి వరద వస్తే రెండు పంటలు పండుతాయని అంచనాకు వస్తున్నారు. జూన్, జూలై నెలల్లో పడే వర్షాలకు అనుగుణంగా నాట్లు వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ ప్రాజెక్టు నుంచి మొత్తం ఆయకట్టు పరిధిలో ప్రతీ సీజన్‌లో 12లక్షల ఎకరాల వరకు సాగునీరు అందుతుండటంతో ఈ దఫా కూడా నీళ్లు వస్తాయని అన్ని కాల్వల పరిధిలోని రైతాంగం సిద్ధమవుతోంది. కొంత మంది రైతులు దుక్కులను సిద్ధం చేస్తుండగా మరికొంత మంది రైతులు నారుమళ్లను వేశారు. భారీ వర్షాలు పడితే నాట్లు వేసి ప్రాజెక్టులోకి నీళ్లు వచ్చిన తర్వాత విడుదల చేసే అవకాశం ఉన్నందున పంటలు పండుతాయని ఆశతో పెట్టుబడి పెట్టేందుకు సిద్ధమవుతున్నారు.

ఉత్తర తెలంగాణకు వర ప్రదాయిని

ఎస్సారెస్పీ ఉత్తర తెలంగాణ రైతులకు వరప్రదాయంగా మారింది. ప్రాజెక్టు నిర్మాణమై 43 ఏళ్లు అవుతుంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఐదేళ్లు మినహా మిగతా అన్ని సంవత్సరాలు ప్రాజెక్టు నుంచి రెండు పంటలకు సాగునీరు అందింది. వానాకాలంతో పాటు యాసంగిలో కూడా మొత్తం ఆయకట్టుకు సాగునీరును అందించారు. ప్రాజెక్టు నిర్మాణమైన తర్వాత ఐదేళ్లలో వర్షాలు తగ్గడం వల్ల ఒక పంటకే నీరు ఇవ్వగా మిగతా అన్ని సంవత్సరాలు రెండు పంటలకు అందించారు. కాకతీయ, లక్ష్మి, సరస్వతి కాలువలతో పాటు గుత్ప, అలీసాగర్, చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకాలకు భారీ ఎత్తున నీటిని అందించారు. ప్రాజెక్టు నిర్మాణం అయిన తర్వాత ఉత్తర తెలంగాణ జిల్లాలు సశ్యశామలంగా మారడంతో పాటు వరి పండించడంలో జాతీయ స్థాయిలోనే పేరొచ్చింది. ధాన్యం దిగుబడిలో దేశంలోనే నెంబర్ వన్‌గా రాష్ట్రం మారింది. ఈ ప్రాజెక్టు నిండితే ప్రతీ సంవత్సరం 12లక్షల ఎకరాల వరకు సాగునీరు ఆయకట్టుకు అందుతుంది. కాకతీయ కాలువ ద్వారా అత్యధికంగా ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్నారు. ఈ కాలువ ద్వారా నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, హన్మకొండ, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్నారు. ఇవేకాకుండా కాకతీయ కాలువ స్టేజ్-2 ద్వారా సూర్యాపేట జిల్లాకు కూడా సాగునీరును సరఫరా చేస్తున్నారు. ఎస్సారెస్పీ నిండే సమయంలో నీటిని వరద కాలువ ద్వారా మిడ్‌మానేరు, ఎల్ఎండీకి తరలిస్తున్నారు. అక్కడి నుంచి ఆయకట్టు సాగుకు విడుదల చేస్తున్నారు. గత సంవత్సరం కూడా రెండు సీజన్‌లో ప్రాజెక్టు ద్వారా సాగునీటిని విడుదల చేశారు. రెండు పంటలకు నీటిని అందించారు. ప్రాజెక్టు ద్వారా ఆయకట్టుకు సాగునీరు అందుతుండటంతో వరిసాగు గణనీయంగా పెరిగింది. ఆయకట్టు పరిధిలో సన్నరకాల సాగుకు కూడా రైతులు పెంచారు. గత సంవత్సరం రెండు పంటలకు సాగు నీరు అందించడం వల్ల ధాన్యం దిగుబడి ఎక్కువగా వస్తుంది. ఇప్పటికీ కొన్ని జిల్లాల పరిధిలో కొనుగోళ్లను చేస్తున్నారు.

వరి సాగుకు ఏర్పాట్లు

వర్షాకాలం మొదలు కావడం వల్ల ఆయకట్టు పరిధిలోని రైతులు ఈ సీజన్‌లో కూడా ఈ ప్రాజెక్టుపైనే ఆశలు పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా వానాకాలంకు సాగునీరు అందుతుందని భావిస్తున్నారు. ఎక్కువ మొత్తంలో పంటలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. వరిసాగుకు ఇప్పటి నుంచే ఏర్పాట్లను చేసుకుంటున్నారు. ప్రతీ సీజన్‌లో పంటకు సాగునీరు అందుతుండటం వల్ల ఈ దఫా కూడా కాకతీయ, సరస్వతి, లక్ష్మి, గుత్ప, అలీసాగర్‌తో పాటు చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ప్రాజెక్టు కింద పంటలను వేసేందుకు సిద్ధమవుతున్నారు. వర్షాలు పడిన విధంగానే వరి

మిగతా 8వ పేజీలో...



సొంతింటి కల సాకారమయ్యేదెన్నడో ?

- ఆర్మూర్ మండలంలో నిరుపయోగంగా మారిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు
- అర్హులకు పంపిణీ చేయని అధికారులు
- ఆశగా ఎదురుచూస్తున్న దరఖాస్తుదారులు



7

జొన్న డబ్బుల కోసం రైతుల ఎదురుచూపులు

- 3 వేల క్వింటాళ్ల జొన్నలను విక్రయించిన కామారెడ్డి జిల్లా లింగపేట మండల రైతులు
- నెల రోజులు దాటినా రైతుల ఖాతాలో జమ చేయని అధికారులు
- ఖరీఫ్ సాగు పెట్టుబడికి ఇబ్బంది పడుతున్న అన్నదాతలు



7



సమావేశంలో మాట్లాడుతున్న ఓమయ్య

చట్టాలను పునరుద్ధరించాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

నిజామాబాద్ కల్చరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకురానున్న 4 లేబర్ కోడ్‌లను రద్దు చేసి 44 రకాల చట్టాలను పునరుద్ధరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన రైస్‌మిల్ పరిశ్రమ కార్మికుల విస్తృత సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలను వ్యతిరేకిస్తూ జూలై 9న నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెలో రైస్‌మిల్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రైస్‌మిల్ పరిశ్రమలో 8గంటల నుంచి పనిచేస్తున్న కార్మికులకు చట్టప్రకారం ఓవర్ టైమ్ డ్యూటీలు చెల్లించాలని అన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ అమలు చేయడంతో పాటు వలస కార్మిక చట్టాన్ని అమలు చేయాలని అన్నారు. కార్మిక కనీస వేతనం 26వేలకు పెంచాలని, పండుగ, జాతీయ, ఆర్జిత సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అనిల్, ఉపాధ్యక్షుడు జాఫర్, సహాయ కార్యదర్శి సాయిలు, లాయక్, రమేష్, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజు, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కొరత!



- ఇసుక కొరతతో నిర్మాణాలు మొదలు పెట్టని లబ్ధిదారులు
- పక్కనే గోదావరి, మంజీరాలు ఉన్నా లభించని ఇసుక
- కృత్రిమ కొరతను సృష్టిస్తున్న ఇసుక మాఫియా
- జిల్లాలో నత్తనడకన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

నిజామాబాద్ అర్బన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక కష్టాలు తప్పడం లేదు. ఇసుక కొరతతో లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను ప్రారంభించడం లేదు. లబ్ధిదారులకు ప్రభుత్వమే ఉచితంగా ఇసుకను అందజేస్తుందని ప్రకటించినప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల పరిధిలో ఇప్పటికీ కేవలం 514 ఇళ్లు మాత్రమే నిర్మాణంలో ఉండడం జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పరిస్థితికి అద్దం పడుతోంది. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముఖ్యంగా ఇసుక కొరత అధికంగా ఉంది. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ప్రభుత్వమే ఉచితంగా ఇసుకను అందజేస్తుందని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ క్షేత్రస్థాయిలో ఇసుక దొరకకగా లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను ప్రారంభించడం లేదు. జిల్లాలో ప్రభుత్వం నుంచి ఒక్క ఇసుక పాయింట్ కూడా లేకపోవడం గోదావరి, మంజీరా నదులు పక్కనే పారుతున్నా ఇసుక దొరకక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. బోధన్, బాన్సువాడ, బాల్కొండ నియోజకవర్గాల పరిధిలో ఇసుక దొరికే అవకాశం ఉన్నా అక్కడ ఉన్న పరిస్థితులతో ఇసుక దొరకని పరిస్థితి నెలకొంది. ప్రైవేటుగా ఇసుక కొనుగోలు చేద్దామన్నా వేలల్లో రూపాయలు చెల్లించాల్సిన పరిస్థితి ఉంది. పేద బడుగుల బలహీన వర్గాల వారు సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు ఇసుక కొనుగోలు చేయడం ఇబ్బందికరంగా ఉంటుంది. ప్రస్తుతం వర్షాకాలం మొదలు కావడంతో వాగులు, వంకలు వర్షం నీటితో నిండి ఉండటంతో ఇసుక దొరకని పరిస్థితి ఉంది. కాళేశ్వరం నుంచి తీసుకువచ్చే ఇసుకకు టన్నుకు రూ.1700 చొప్పున వసూలు చేస్తుండగా ఇక్కడ స్థానికంగా ఇసుకను అమ్మేవారు సైతం ట్రాక్టర్‌కు రూ.6వేల నుంచి రూ.7వేలు, 200 ఫీట్ల టిప్పర్‌కు రూ.12వేల నుంచి రూ.15వేలు వసూలు చేస్తున్నారు. వేసవిలోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించి ఉంటే ఇప్పుడు ఈ పరిస్థితి ఉండేది కాదని లబ్ధిదారులు వాపోతున్నారు. గ్రామాలలో ప్రస్తుతం వ్యవసాయ పనులు ప్రారంభమవుతున్న దృష్ట్యా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై లబ్ధిదారులు ఆసక్తిని చూపడం లేదు. ప్రస్తుతం ముహూర్తాలు కూడా లేకపోవడం వచ్చేది ఆషాఢ మాసం కావడంతో దసరా తర్వాతనే ఇంటి నిర్మాణాలు ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆదిలోనే హంసపాదు ఎదురవుతోంది. ఒకవైపు ఇసుక కొరత మరోవైపు వర్షాకాలం ప్రారంభం కావడం జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయి.

డిచ్‌పల్లిలో నిర్మాణంలో ఉన్న నమూనా ఇందిరమ్మ ఇల్లు



జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలోని ఆరు నియోజకవర్గాల పరిధిలో మొత్తం 19వేల 490 ఇళ్లను మొదటి విడతగా నిర్మించాలని లక్ష్యం కాగా 16వేల 286 ఇళ్లు మంజూరు అయ్యాయి. కానీ ఇప్పటి వరకు కేవలం 514 ఇళ్లు మాత్రమే నిర్మాణాన్ని ప్రారంభించాయి. అందులో 454 ఇళ్లు బేస్‌మెంట్ లెవల్‌లో ఉండగా 60 ఇళ్లు గోడల లెవల్ లో నిర్మాణంలో ఉన్నాయి. నిజామాబాద్ అర్బన్‌లో ఇప్పటికీ ఒక్క ఇళ్లు మంజూరు కాకపోగా మిగిలిన నియోజకవర్గాలలోని పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. ఆర్మూర్, బోధన్, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బాల్కొండ నియోజకవర్గాలలో మొదాటి విడతగా 3500 ఇళ్ల చొప్పున లక్ష్యం కాగా బాన్సువాడ నియోజకవర్గంలో 1990 ఇళ్లు లక్ష్యం నిర్ణయించారు. కానీ ఆర్మూర్ నియోజకవర్గానికి 3144, బోధన్ నియోజకవర్గానికి 3156, బాన్సువాడకు 1899, నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గానికి 752, నిజా మాబాద్ రూరల్ నియోజకవర్గానికి 4011, బాల్కొండ నియోజకవర్గానికి 3324 ఇళ్ల నిర్మాణానికి అధికారిక మంజూరు వచ్చింది. కానీ కేవలం 3569 ఇళ్లు మాత్రమే ఆరు నియోజకవర్గాల పరిధిలో గ్రౌండింగ్

మిగతా 8వ పేజీలో...

ఆర్‌బీవీఆర్‌ఆర్ సొసైటీలో ఎన్నికలు

- ఓటు హక్కును వినియోగించుకున్న రూరల్ ఎమ్మెల్యే

నిజామాబాద్ అర్బన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్‌బీవీఆర్‌ఆర్ పాఠశాల సొసైటీ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఎన్నికలు నిర్వహించారు. సొసైటీకి సంబంధించిన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శితో పాటు ఇతర కార్యవర్గానికి ఎన్నికలు నిర్వహించారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆర్‌బీవీఆర్‌ఆర్ పాఠశాలలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.



ఓటు వేస్తున్న రూరల్ ఎమ్మెల్యే

జగన్నాథ రథయాత్రను విజయవంతం చేయండి

నిజామాబాద్ కల్చరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఇస్కాన్ ఆధ్వర్యంలో జూలై 4న నిర్వహించనున్న పూరీ జగన్నాథ రథయాత్రను విజయవంతం చేయాలని ఆర్ఎస్ఎస్ ఇందూరు విభాగ్ ప్రచారక్ వెంకట శివకుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శ్రీకృష్ణుడు జగత్తును ఏలేటువంటి స్వామి అని భగవద్గీత వర్ణించి చెబుతుందని అన్నారు. అలాంటి స్వామి జూలై 4న మన నగరంలో పలు వీధులగుండా శోభాయాత్రగా దర్శనమిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ కంఠేశ్వర్ అధ్యక్షుడు రామానంద రాయ్ ప్రభుదాస్, స్వామి యాదవ్, సుధాకర్, రఘు, ఇస్కాన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పడిగెలలో గ్రామదేవతలకు జలాభిషేకం


ఊరేగింపుగా వెళ్తున్న సభ్యులు

వేల్పూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడిగెల గ్రామంలో ఆదివారం గ్రామ దేవతలకు గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గంగనీళ్లతో జలాభిషేకం నిర్వహించారు. అంతకు ముందు గ్రామంలోని రామాలయం నుంచి గంగనీళ్ల వలగొడుగుతో డప్పు వాయిద్యాల మధ్య గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా నిర్వహిస్తు పవిత్రమైన గంగజలాలను బ్రహ్మంగారి ఆలయం, గంగమ్మతల్లి, పోచమ్మ, ఐదుచేతుల పోచమ్మ, ముత్యా లమ గంగజలాలతో జలాభిషేకం నిర్వహించారు. ఆయా ఆలయాల చుట్టు గంగనీళ్లతో ఐదుసార్లు ప్రదక్షణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ గ్రామంలోని పాడిపంటలు బాగా పండి ప్రజలందరు సుఖశాంతులో ఉండాలని గ్రామదేవతలకు మొక్కుకున్నారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా దేవేందర్


నియామక పత్రాన్ని అందజేస్తున్న పసుపు బోర్డు చైర్మన్

కమ్మర్‌పల్లి, జూన్ 15: భారతీయ జనతాపార్టీ కమ్మర్‌పపల్లి మండల ఎస్సీ మోర్చా నూతన అధ్యక్షుడిగా చౌట్‌పల్లి గ్రామానికి చెందిన చిట్యాల దేవేందర్‌ను నియమించారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యలయంలో బాల్కొండ నియోజిక వర్గ ఇన్‌చార్జ్ మల్లికార్జున్ రెడ్డి నాయకత్వంలో దేవేందర్‌కు జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి నియమక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కమ్మర్‌పల్లి మండల పార్టీ అధ్యక్షుడు బద్దం రమేష్ రెడ్డి, జిల్లా బీజేపీ నాయకులు ఉన్నారు.

కోనాసముందర్‌లో వీడీసీ నూతన కార్యవర్గం


వీడీసీ నూతన పాలకవర్గ సభ్యులు

కమ్మర్‌పల్లి, జూన్ 15: మండలంలోని కోనాసముందర్ గ్రామాభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దేవాలయంలో కులసంఘాల సభ్యులు సమావేశమై నూతన పాలకవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. వీడీసీ నూతన అధ్యక్షుడిగా మెలగంగాధర్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా శెట్టిపల్లి గంగాధర్, కోశాధికారిగా కంతి గంగాధర్, సలహాదారులుగా సామ బాపురెడ్డి, కలేరు రాజేశ్వర్, చెలిమెట గంగాధర్, మరో 15 మంది సభ్యులుగా నూతర పాలకవర్గం ఎన్నుకున్నారు.

సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న ఏఎంసీ డైరెక్టర్

నందిపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వికలాంగులు క్షీరాభిషేకం చేశారు. వికలాంగుల వివాహ ఖర్చు రూ.50 నుంచి రూ.లక్ష వరకు పెంచడంతో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఆర్మూర్ ఇన్‌చార్జి వినయ్ కుమార్‌రెడ్డి చిత్రపటాలకు నిజామాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెంట ఇంద్రుడు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్ క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు దమ్మాయి శ్రీను, మాన్సూర్ భూమేష్, ఎడ్డిగారి నిఖిల్, వికలాంగుల సంఘం మండల అధ్యక్షులు ఎస్.లక్ష్మి, సభ్యులు కలీం, సాగర్, పెద్దకాపు ముత్యం, సుదర్శన్, సాయమ్మ, భారతీ తదితరులు ఉన్నారు.

కమ్మర్‌పల్లిలో ఉచిత వైద్యశిబిరం


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కమ్మర్‌పల్లి, జూన్ 15: మండల కేంద్రంలో తెలంగాణ ప్రాంతీయ ఉపాధ్యాయసంఘం (తపస్) ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పిల్లల ఉచిత వైద్యశిబిరానికి అనూహ్య స్పందన లబించింది. పిల్లల వైద్యనిపుణులు డాక్టర్ చిలుక చైతన్య ఈ వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి తల్లిదండ్రులు తమ పిల్లలతో వచ్చి వివిధ రకాల వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో తపస్ రాష్ట్ర జిల్లా బాధ్యులు రామకృష్ణ, కిషన్ రెడ్డి, కమ్మర్‌పల్లిమార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, చిలుక బలరాం, ఉపాధ్యాయులు రుద్ర మధు, లక్ష్మీనర్సయ్య, మండల తపస్ అధ్యక్షులు సల్లూరి కిషన్ గౌడ్, కార్యదర్శి రమేష్, సభ్యులు పాల్గొన్నారు.

కల్దుర్కిలో బీరప్ప ఆలయానికి భూమిపూజ


ఆలయానికి భూమిపూజ నిర్వహిస్తున్న భక్తులు

బోధన్‌రూరల్,జూన్15(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని కల్దుర్కి గ్రామంలో కుర్మ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప మందిరాన్ని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆలయ శిఖరానికి నవధాన్యాలతో పూజ కార్యక్రమం నిర్వహించారు. కుల సంఘ మహిళలు మంగళహారతులతో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కుర్మ సంఘం అధ్యక్షులు సిరిగిరి రాం, కార్యదర్శి గౌరుగొండ, అశోక్, సభ్యులు నాగగొండ, శ్రీనివాస్, సాయిగొండ, శ్రీనుగొండ పాల్గొన్నారు.

ఖరీఫ్ కోసం రైతులు బిజీ బిజీ

- అడపాదడపా కురుస్తున్న వర్షాలు
- సాగుకు సమయాత్తం


మాయాపూర్ శివారులో పసుపు విత్తనాలు వేస్తున్న దృశ్యం

నందిపేట, జూన్ 15: మండలంలో అడపా, దడపా కురుస్తున్న వర్షాలకు రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతీరోజు సాయంత్రం, రాత్రి పూట ఒక మోస్తారు వర్షాలు కురియడంతో రైతులు ఖరీఫ్ పనుల్లో నిమగ్నమైనారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విత్తనాలు విత్తడంలో బిజీబిజీగా ఉన్నారు. కొద్దిపాటి వర్షాలకు పసుపు, సోయా సాగు చేసిన రైతులు ఊరట చెందారు. మరి కొంత మంది రైతులు నారు పోయడం, సోయా,పసుపు, మొక్క జొన్న విత్తడంలో ఉన్నారు. మండలంలోని సుమారు 21వేయి పైచీలుకు ఎకరాల భూమిని సాగుకు యోగ్యం చేశారు.అందులో 19వేల 500 ఎకరాల్లో రైతులు వరి సాగు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. మిగతా ఎకరాల్లో పసుపు, సోయా, కూరగాయలు పండించేందుకు రైతులు ప్రణాళికలు సిద్దం చేశారు. ఈ పాటికే సగం తోట భూముల్లో విత్తనాలు పడిపోయాయి. గత రెండు, మూడు సంవత్సరాలు గా పడావుగా ఉన్న భూములనుసైతం రైతులు ఈ సంవత్సరం సాగుకు సిద్ధం చేస్తున్నారు. నందిపేట మండలంలో ప్రైవేట్ కంపెనీల విత్తనాలుకాకుండా ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా పంపిణీ చేసిన జీలుగును చల్లిదున్నుతు చూస్తూ వరి నాట్లు వేస్తున్నారు. అంతే కాకుండా వ్యవసాయ శాఖ ద్వారా క్వాలిటీ సీడ్ పేరుతో వరి విత్తనాలను అలాగే 5కిలోల బరువున్న పెసర్ల సంచిలను రైతులకు ఉచితంగా అందజేశారు. ఇది వరకే మం డలంలోని రైతులు ప్రైవేట్ కంపెనీలు సరఫరా చేసిన వరి విత్తనాలతో నారు పోసేశారు. మండలంలోని తల్వేద, కంఠం, లక్కంపల్లి తదితర గ్రామాల్లో వరి నాట్లు మొదలైనాయి. దేశంలోని బీహార్, కలకత్తా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని వలస కూలీలు మండలానికి వచ్చేశారు. అంతే కాకుండా రాష్ట్రంలోని సూర్యపేట, నల్గొండ జిల్లాల నుంచి వ్యవసాయ కూలీలు రావడానికి ఇక్కడి రైతులు ముందస్తుగా డబ్బులు చెల్లించారు. ఐచర్ వాహనాల కోసం వేచి చూస్తున్నారు.


కంఠంలో వరి నాట్లు వేస్తున్న యువకులు

ఘనంగ బోనాల ఊరేగింపు


బోనాల ఊరేగింపులో పాల్గొన్న మహిళలు


పోతరాజుల విన్యాసాలు

కమ్మర్‌పల్లి, జూన్ 15: కమ్మర్‌పల్లి మండల కేంద్రం శివారులోని బీమార్జున ఆలయ ఆరవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ముదిరాజ్ సంఘాల అద్వర్యంలో బోనాల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. గ్రామం లోని ప్రతి ముదిరాజ్ ఇంటి నుంచి మహిళలు తమ బోనాలతో భగత్‌సింగ్ వద్దకు చేరుకుని బోనాలకు ప్రత్యేకపూజలు నిర్వహించి గ్రామ శివారులోని బిల్కుపై కొలువుదీరిన భీమార్జున ఆలయం వరకు జాతీయ రహదారిగుండా మేళతాళాలు మంగలవాయిద్యాలతో పోతరాజుల విన్యాసాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామివారికి బోనాలు, నైవేద్యాలు సమర్పించారు. బోనాలను గ్రామ ముదిరాజ్ మహిళలు, ముదిరాజ్ సంఘాల సభ్యులు మేళతాళాలు మంగళ వాయిద్యాలతో గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కమ్మర్‌పల్లి మాజీ ఎంపీపీ లోలం గౌతమిసుమన్, మాజీ ఎంపీటీసీ కొత్తపల్లి హరికఅశోక్, గణేష్, తలయకమిటీ సభ్యులు


బోధన్‌లో....

ఇందూర్ రాజేందర్,నాగార్జున్, గంగసాయిలు, భానూచెందర్, ఎం. రాజేశ్వర్, కొత్తపల్లి అశోక్, గంగాధర్,నవీన్,శివ, సురేష్, ఆకుల దేవదాస్, గ్రామస్తులు సాగర్, మురళి, బాజన్న, బాలకృష్ణ, దుర్గయ్య, సార్గల రమేష్, సభ్యులు మహిళలు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్ : బోధన్ పట్టణంలోని ధ్యాకం గల్లీ కాలనీవాసులు మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బోనాల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్నూరు మహిళలు బోనాలతో మహాలక్ష్మి ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అమ్మవారికి ఒడిబియ్యాన్ని నింపి మొక్కులు తీర్చుకున్నారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్నూరు కాపు కుల సంఘ ప్రతినిధులు, కులసంఘ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని నాళేశ్వర్‌లో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలతో పాటు పురుషులు తలపై బోనాలను ఎత్తుకుని స్థానిక మహాలక్ష్మి ఆలయానికి తరలివెళ్లారు. ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, యువతి, యువకుల నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. పాడిపంటలు చల్లగా ఉండాలని కోరుతూ గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పెద్ద సాయన్న, కిషన్, బాగాజీ లక్ష్మణ్, గంగాధర్, రాకేష్, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.


నాళేశ్వర్‌లో బోనాలతో గ్రామస్థులు


నాళేశ్వర్‌లో జరిగిన బోనాల ఉత్సవాలలో పాల్గొన్న గ్రామస్థులు

నీట్‌లో పెర్కిట్ విద్యార్థిని ప్రతిభ


బచ్చెవల్ శ్రేష్ఠ

ఆర్మూర్ రూరల్, జూన్15 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వెల్లడైన నీట్ పరీక్ష ఫలితాల్లో ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌కి చెందిన బచ్చెవాల్ శ్రేష్ఠ ఆల్‌ఇండియా స్థాయిలో 1978 ర్యాంక్ సాధించారు. ఓబీసీ కేటగిరిలో 654ర్యాంకు వచ్చింది. బచ్చెవాల్ గంగమోహన్ రేఖ దంపతుల కూతురు శ్రేష్ఠ చిన్ననాటి నుంచి చదువులో చురుకుగా ఉండేది. తండ్రి గంగమోహన్ మంచిర్యాల్ జిల్లా బీమిని మండల ఎంపీడీవోగా పనిచేస్తున్నారు. భవిష్యత్తులో న్యూరో సర్జర్ కావాలని శ్రేష్ఠ తన ఆకాంక్షను వెల్లడించింది.

కోటగిరి వాసి..


విద్యార్థిని బీర్కూర్ సంజన

కోటగిరి,జూన్15(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల కేంద్రానికి చెందిన బీర్కూర్ సంజన నీట్‌లో ఆలిండియా 3161ర్యాంకును సాధించింది. రాష్ట్ర బీసీ కేటగిరిలో 1132వ ర్యాంకు సాధించింది. కోటగిరి మాజీ సర్పంచ్ బీర్కూర్ గంగాధర్ మనవరాలు సంజన హైదరాబాద్‌లోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసింది. నీట్‌లో ఆలిండియా ర్యాంకు సాధించడం పట్ల కోటగిరి గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం


కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

బోధన్‌రూరల్,జూన్15(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. స్వామివారి కల్యాణ నక్షత్రం శ్రావణ నక్షత్రం సందర్భంగా ప్రతినెల మాస కల్యాణం నిర్వహిస్తారని ఆలయ కమిటీ నిర్వాహకులు మురళి తెలిపారు. ఆదివారం స్వామివారి మాసకల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణ మహోత్సవంలో భాగంగా విశ్వక్సేనారాధన, సుదర్శన పూజ, వాసుదేవ పుణ్యవచనం, శ్రీహరి కంకణ ధరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య వస్త్ర సమర్పణ, కన్యాదానం, మంగళ పూజ, మంగళధారణ తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు మాట్లాడుతూ కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి అన్నారు. కార్యక్రమంలో భక్తులు,ఆలయ కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

'రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సైనికుల్లా పనిచేయాలి'


సమావేశంలో పాల్గొన్న ఏఎంసీ చైర్మన్, పార్టీ నాయకులు

మెండోర, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు సైనికుల్లా పనిచేసి పార్టీ అభ్యర్థుల గెలుపుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని వేల్పూర్ మార్కెట్ కమిటి చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి అన్నారు. ఆదివారం మెండోర, కోడిచర్ల, చాకిర్యాల్, దూదిగాం గ్రామాల్లో ప్రజలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజా ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని సూచించారు. గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాకులు కలిసి మెలిసి ఉండి పార్టీ అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండోజి రవి, కొప్పెల మోహన్, దేవరాజ్, ప్రమోద్, గంగాధర్, శ్రీనివాస్, రాజన్న, రంజిత్, రవి, మురళి, దేవన్న తదితరులు పాల్గొన్నారు.

శ్రీనాగలింగేశ్వర ఆలయ ఆవరణలో శ్రమదానం


ఆలయ ఆవరణలో శ్రమదానం చేస్తున్న సంస్థ సభ్యులు

ఆర్మూర్ రూరల్ , జూన్15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనాగలింగేశ్వర ఆలయంలో ఆదివారం మహాత్మస్వచ్చంద సంస్థ ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణ పరిసరాల్లో ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్, ఆలయ కమిటి సభ్యులు డివిఎస్ చక్రవర్తి, సత్యశ్రీనివాస్, సంస్థ సభ్యులు ప్రశాంత్, సుంకె నిశాంత్, రాజ్‌కుమార్, అరుణ్‌కుమార్, నరేష్, గణేష్, కొత్తూరు రాజయ్య, బాలాజీ, బోజన్న, తదితరులు పాల్గొన్నారు.

మెండోరలో పస్కరాజుల పండుగ


పూజలు చేస్తున్న ముదిరాజ్ కులస్థులు

మెండోర, జూన్15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పస్కరాజుల పండగను ముదిరాజ్ కులస్థులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ కులస్తులు ఖరీఫ్ సీజన్లో మొదటగా పస్కారాజుల పండగ చేసిన తర్వాతే గ్రామంలో ఉన్న దేవతల పండగలు గ్రామస్తులు నిర్వహిస్తారు. ముదిరాజ్ కులస్తులు జీవనాదారం పండ్ల పెంపకంతో జీవనం సాగిస్తుండటంతో నాటి రాజులు ముదరిఆజ్ కులస్థులే గ్రామంలో ఉన్న దేవతలకు పండ్లను సమర్పించే ఆనవాయితీ తీసుకువచ్చారు. అందులో భాగంగా ముదిరాజ్ కులస్తులు గ్రామంలో ఉన్న పస్కారాజులకు నైవేద్యం సమర్పించి భక్తి శ్రద్దలతో మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి


మృతిచెందిన గేదె

ఏర్గట్ల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన మణిమానిక్యం శ్రీనివాస్‌కు చెందిన గేదె ఆదివారం విద్యుత్ ఘాతుకంతో మృతిచెందింది. స్థానిక పశు వైద్యాధికారిణి రాజ్యలక్ష్మీ తెలిపిన వివరాల ప్రకారం గ్రామశివారులో మేతకు వెళ్ళిన గేదె ప్రక్కన ఉన్న విద్యుత్ కరెంట్ తీగలు తెగి పైన పడటంతో మృతి చెందినట్లు ఆమె తెలిపారు. సుమారు 80 వేల నష్టం జరిగిందన్నారు.

బాధితుడిని పరామర్శించిన ఆర్మూర్ ఎమ్మెల్యే


బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

ఆర్మూర్ టౌన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని హాస్పిటల్‌లో ఆదివారం మోర్తాడ్‌కు చెందిన రొయ్యల సురేష్‌ను ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల ఒక వర్గం వారు దాడిచేసిన ఘటనలో సురేష్ తీవ్రంగా గాయపడ్డాడు. దాడి జరిగిన బాధితుడిని, ఆయన కుటుంబసభ్యులను వివరాలు అడిగి తెలుసు కున్నారు. అనంతరం మోర్తాడ్ ఎస్సైతో ఫోన్‌లో మాట్లాడారు. పోలీస్ లు ప్రవర్తిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘట నపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఎమ్మెల్యే వెంట బీజేపీ సీనియర్ నాయకులు కంచెట్టి గంగాధర్, పట్టణ అధ్యక్షుడు మందుల బాలు, ద్యాగ ఉదయ్ పాల్గొన్నారు.

నేడు అర్గుల్‌లో రైతు నేస్తం ప్రారంభం

జక్రాన్‌పల్లి, జూన్15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్గుల్ గ్రామంలో రైతు వేదికలో సోమవారం రైతునేస్తం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వ్యవసాయాధికారిణి దేవిక తెలిపారు. జక్రాన్‌పల్లి, అర్గుల్, కలిగోట్ రైతువేదికలకు నూతనంగా రైతునేస్తం కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లు మంజూరయ్యాయని ఆమె తెలిపారు. రైతులకు నేరుగా వ్యవసాయానికి సంబంధించిన సల హాలు, సూచనలు ఇవ్వడానికి ప్రత్యక్ష ప్రచారం ద్వారా రైతులు వీక్షించి వారి సందేహాలు నివృత్తి చేసుకోవడానికి రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానం చేశారన్నారు.

'విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి'


ఆర్థిక సహాయం అందజేస్తున్న సభ్యులు

కోటగిరి,జూన్15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన నిఖిత అనే విద్యార్థిని గురుకుల పాఠశాలలో చదివి ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. నిఖితకు ములుగు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించింది. ఆర్థికస్తోమత లేని కారణంగా ఆమె చదువు మధ్యలో ఆగిపోకుండా ఉండేందుకు కోనేరు చారిటబుల్ ట్రస్టును సంప్రదించారు. ఆదివారం ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ విద్యార్థిని నిఖితను అభినందించడంతో పాటు చదువుల కొరకు 20వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో కోనేరు తరుణ్ సాయితేజ, బీజేపీ నాయకులు నవీన్, మోహన్ రావు, పాకల సాయిలున్నారు.

'బాధిత కుటుంబానికి అండగా ఉంటాం'

మండలంలోని ఎత్తొండ గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు శ్యామ్ సోదరుడు రాజు అనారోగ్యంతో మృతిచెందారు. ఆదివారం కుటుంబాన్ని బీజేపీ నాయకులు, ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. రాజు కుమారైను కోనేరు ట్రస్టు తరఫున ఉన్నత చదువులు చదివించి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షులు నవీన్, ప్రధాన కార్యదర్శి విలాస్, జగదీష్, శివరాం కార్తీక్, వెంకటేష్ పాల్గొన్నారు.

రుద్రూరు: బాన్సువాడ నియోజకవర్గం రుద్రూర్ మండలంలోని రాయకూర్ గ్రామానికి చెందిన బేగరి సాయికుమార్ బాన్సువాడ శశాంక్ కళాశాలలో ఎంఎస్‌డబ్ల్యూ చదువుతున్నారు. తన చదువు కోసం ట్రస్ట్‌ను ఆశ్రయించగా కోనేరు చారిటబుల్ ట్రస్టు తరఫున 10 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని కోనేరు తరుణ్ సాయితేజ విద్యార్థి సాయి కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో బాన్సువాడ నియోజకవర్గ బీజేపీ నాయకులు, ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్, మండల బీజేపీ అధ్యక్షులు అలపాటి హరికృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

జొన్నల డబ్బుల కోసం
రైతుల ఎదురుచూపులు

- 162 మంది రైతులు
- 3 వేల క్వింటాళ్ల జొన్నలు విక్రయం
- ఆందోళనలో రైతులు


పర్మల్లలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు (ఫైల్)

లింగంపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలో జొన్నలు విక్రయించిన రైతులు నెల రోజులుగా డబ్బుల కోసం ఎదురుచూస్తున్నారు. మండలంలోని పర్మల్ల, శెట్పల్లి, రాంపల్లి, బోనాల్ గ్రామాలతో పా టు పలు గ్రామాల్లో జొన్న పంటను అధికంగా సాగు చేశారు. ప్రభుత్వం లింగంపేట సహకార సంఘం ద్వారా జొన్నలను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసింది. కాని జొన్న కొనుగోలు కేంద్రంలో పంటను అమ్మి నెల రోజులు దాటిన రైతులకు ఇప్పటికి డబ్బులు వారి ఖాతాలో జమ కాలేదు. దీంతో తదుపరి పంటకు పెట్టుబడి లేక రైతెలె తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో మొత్తం 3 వేల క్వింటాళ్ల జొన్నలను 162మంది రైతుల నుంచి లింగంపేట సహకార సంఘం ద్వారా కొనుగోలు చేశారు. సాధారణంగా పంట విక్రయించిన కొద్ది రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయి. ఈ సారి జొన్నలు విక్రయించి నెల రోజులు దాటినా డబ్బులు ఖాతాలో జమ కావకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఖరీఫ్ సాగు కోసం విత్తనాల కోసం అప్పులు సైతం ఇవ్వడం లేదని రైతు ఆవేదన చెందుతున్నారు.

ఆందోళనలో రైతులు

పెట్టుబడి డబ్బులు లేకపోతే తదుపరి సాగు పనులు ప్రారంభించలేమని, ఇది తమ జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతుందని వారు అంటున్నారు. సంబంధిత అధికారులు ఈ విషయంపై వెంటనే స్పందించి, రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా తక్షణచర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ పరిస్థితిపై అధికారులు తక్షణమే స్పందించి, రైతుల కష్టాలను తీరుస్తారని మండల రైతులు ఆశిస్తున్నారు.

ఖరీఫ్‌కు డబ్బులు లేక ఇబ్బందిగా ఉంది..
- గంగారెడ్డి, రైతు, పర్మల్ల



నెల రోజుల క్రితం పర్మల్ల గ్రామంలోని జొన్న కొనుగోలు కేంద్రంలో నా పంటను విక్రయించాను. మొత్తం 6ఎకరాలలో సాగు చేశాను. 62క్వింటాళ్ల జొన్నలు పండిం చాను, దిగుబడి బాగానే వచ్చింది. కాని ఇప్పటి వరకు నా అకౌంట్‌లో డబ్బులు జమ కాలేదు. తదుపరి పంటకు పెట్టుబడి పెట్టడానికి చాలా కష్టంగా ఉంది. మాలాంటి చిన్న, మధ్యతరహా రైతులకు ఈ డబ్బులు చాలా కీలకం. అప్పులు చేసి పంట వేసుకున్నాం. అధికారులు దయచేసి స్పందించి వెంటనే రైతులకు డబ్బులు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

నెల దాటినా డబ్బులు రాలేదు..
కొడబోయిన శ్రీనివాస్, రైతు, పర్మల్ల



3 ఎకరాలలో జొన్న పంట సాగు చేశాను. 30 క్వింటాళ్ల జొన్నలు పండించాను పర్మల్ల కొనుగోలు కేంద్రంలో జొన్నలను విక్రయించాను. విక్రయించి నెల దాటింది. ధాన్యం డబ్బులు వారం రోజులలోపు వేసిన ప్రభుత్వం జొన్న రైతులపై ఎందుకు చిన్న చూపు చూస్తుందో రూ.లక్ష వర కు వస్తాయి. కొన్ని అప్పులు పోను ఖరీఫ్ సాగుకు ఉపయోగపడ తాయని ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నాను. ఈ నెల 10 వరకు వేస్తారని అధికారులు చెప్పారు. కాని ఇప్పటి వర కు నా అకౌంట్‌లో డబ్బులు జమ కాలేదు. అధికారులు స్పందించి వెంటనే డబ్బులు జమ చేయాలని కోరుతున్నాను.

తగ్గుతున్న చిన్నారుల కంటి చూపు

● పోషకాహారం, శారీరక శ్రమ లేకపోవడం ● టీవీలు, స్మార్‌ఫోన్ వాడకం మరో కారణం


కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

పెద్దకొడప్‌గల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సర్వేంద్రియానాం నయనం ప్రధానం అన్నారు పెద్దలు. మానవునికి ఉన్న అవయవాల్లో అన్నింటి కంటే కండ్లు అతి ముఖ్యమైనవి. ఆ కండ్లే లేకుంటే మనిషి జీవితమే అంధకారంగా మారుతుంది. అంత ప్రాధాన్యత ఉన్న కండ్లు చిన్నారులలో మెల్ల మెల్లగా సమస్యగా మారి వారి పాలిట ఇబ్బందిగా మారు తున్నాయి. గతంతో పోల్చి చూస్తే చిన్నారులలో కంటి సమస్యలు అధికంగా పెరుగుతున్నాయి. ఈ మధ్య కాలంలో విద్యార్థులకు నిర్వహించిన కంటి పరీక్షలలో 100కు 10 మంది చిన్నారులకు పైగా సమస్యలతో బాధపడుతుండటం గుర్తించారు. ఈ విధంగా కంటి సమస్యలు పెరుగు కుంటూ పోతే రానున్న రోజుల్లో చిన్నారులు ఇబ్బంది పడే పరిస్థితులు వస్తాయని హెచ్చరిస్తున్నారు కంటి వైద్యులు.

ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షలు..

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాలలో ఆర్‌బిఎస్‌కే(రాష్ట్రీయ బాల స్వస్థత కార్యక్రమం) ఆధ్వర్యంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో చిన్నారులకు క్రమం తప్పకుండ ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా ప్రతీ నెల వైద్య సిబ్బంది ఆయా గ్రామాలలో గల పాఠశాలల ను ఎంచుకుని ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్షలలో భాగంగా కంటి, గుండె, నరాలకు సంబంధించిన సమస్యలతో పాటు ఇతర పరీక్షలు నిర్వహిస్తారు. ఫేజ్ 1 కింద 8నుండి 10 తరగతులకు సంబంధించిన విద్యార్థులకు, ఫేజ్ 2 కింద 5 నుంచి 8తరగతుల విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తారు. గత సంవత్సరం జుక్కల్ నియోజక వర్గంలోని ఆయా గ్రామాల పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా చాలా మంది చిన్నారులకు కంటి సమస్యలు బయట పడ్డాయి. సరాసరిగా తీసుకుంటే 100 మంది విద్యార్థులలో కంటి సమస్యలతో బాధ పడుతున్న వారిని గుర్తించారు. వీరిలో చాలా మందికి మందులు పంపిణీ చేయగా, కంటి సమస్యలు అధికంగా ఉన్న వారికి అద్దాలు పం పిణీ చేశారు. అయితే పంపిణీ చేసిన ఈ అద్దాలను చాలా మంది చిన్నారులు ధరించాలంటే సిగ్గు పడుతుండటంతో సమస్య మరింత పెరు గుతుందని కంటి వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యాభ్యాసం చేసే వారిలో కంటి సమస్యలు అధికంగా ఉన్నట్లు గుర్తిస్తున్నారు కంటి వైద్యులు.

విటమిన్ ఏ లోపం, శారీరక శ్రమ లేకపోవడం..

ప్రధానంగా కంటి సమస్యలు మిటమిన్ ఏ లోపంతో రావడం ఒక కారణమైతే, పోషకాహారం, శారీరక శ్రమ లేకపోవడం మరో కారణమంటున్నారు కంటి వైద్య నిపుణులు. వసతి గృహాలలో ఉండే విద్యార్థులకు సరియైన సూర్యరశ్మి అందకపోవడం, పోషకాహార లోపంతో ఈ సమస్య మరింత అధికంగా మారుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. గతంలో ఏ పాఠశాలలో చూసిన సాయంత్రం సమయంలో తప్పనిసరిగా విద్యార్థులకు ఆటలు ఆడించేవారు. అయితే రాను రాను విద్యార్థులలో చదువు పై పోటీతత్వం పెరగడంతో ఆటల వైపు కన్నెత్తి చూడటం మానేశారు. దీంతో విద్యార్థులకు శారీరకంగా శ్రమ లేకపోవడంతో ఊబకాయులుగా మారుతున్నారు. అంతేగాక ఇక ఇంటి వద్ద ఉండే విద్యార్థులు పాఠశాల నుండి రాగానే ఫోన్‌కు బానిసలుగా మారడం, సరియైన నిద్ర లేక పోవడం, ఒత్తిడి వంటి సమస్యలతో కంటి చూపు తగ్గిపోవడం కారణం గా మారుతుంది.

కంటి చూపు తగ్గకుండా ఉండాలంటే ఏం చేయాలి..

కంటి చూపు పెరగాలంటే ప్రధానంగా ఆకుకూరలు వినియోగించడంతో పాటు, క్యారట్, బొప్పాయి, చేపలు, గుడ్లు, పాలు తీసుకోవాలి. సెల్ ఫోన్, టివి చూడటం తగ్గించాలి. సెల్‌పోన్‌ను అదే పనిగా చూడటం వలన కంటిలోని రెటినా మాకుల దెబ్బతిని దూరం చూపు తగ్గిపోతుందని హెచ్చరిస్తున్నారు కంటి వైద్యులు. దీంతో పాటుగానే చిన్నారులు పడు కునే ముందు కనీసం 2 గంటలు టివి చూడవద్దని, టివిని 4 గజాల దూరంలో ఉండి చూడాలని సలహా ఇస్తున్నారు. మనిషి నిమిషానికి కం టి రెప్పలను 30 సార్లు అదిలించాలని, టివిలు, ఫోన్లు, ల్యాప్‌టాప్‌ను వినియోగంచే వారు ప్రతీ అరగంటకోసారి లేచి నడవడంతో పాటు దూరం చూస్తే కంటి రెప్పలను ఆడించాలని సూచిస్తున్నారు కంటి వైద్యులు.

ఆర్‌బీఎస్‌కే ద్వారా పరీక్షలు
అర్జున్, వైద్యుడు



గత సంవత్సరం మేము ఆర్‌బీఎస్కే ద్వారా ఆయా పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించాం. ఇందులో భాగంగానే కంటి పరీక్షలలో భాగంగా చిన్నారులకు కంటి పరీక్షలు నిర్వహించగా ప్రతీ 100లో 10 మందికి కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించాం. కొన్ని పాఠశాలల్లో అయితే ఈ సమస్య ఇంకా కొంచెం అధికంగా ఉంటుంది. గతసారి కంటి సమస్యలతో బాధ పడేవారిని గుర్తించి లయన్స్ సహకారంతో కంటి అద్దాలు పంపిణీ చేశాం. అయితే వీటిని విద్యార్థులు తప్పనిసరిగా ధరించాలి. కొంత మంది నామోషీగా భావించి అద్దాలు వాడటం లేదు. దీంతో కంటి సమస్యలు మరింత పెరుగుతాయి. ఇక విద్యార్థులు కూడా శారీరకంగా ఆటలు ఆడటంతో పాటు, ఫోన్లు, టీవీల వినియోగం తగ్గించాలి. దీంతో పాటుగానే ప్రతీరోజు కనీసం అరగంట పాటయిన సూర్యరశ్మి తగిలేలా చూసుకోవాలి.

సొంతింటి కల సాకారమయ్యేదెన్నడో..?!

- పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు
- లబ్ధిదారుల ఎదురుచూపు


డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు

ఆర్మూర్‌రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం బడుగు, బలహీనవర్గాల ప్రజలకు సొంతింటి సౌకర్యం కల్పించాలని రెండు పడక గదుల ఇళ్లను నిర్మించి ఇస్తామని వాగ్దానం చేసింది. అప్పటి సీఎం కేసీఆర్ అర్హులైన వారం దరికి డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. అనేక గ్రామాల్లో డబుల్ బెడ్‌రూంల ఇళ్ల నిర్మాణాలకు నోచుకోలేదు. ఆర్మూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల్లో సుమారు రెండు వేలకు పైగా డబుల్ బెడ్ రూం ఇళ్ళను మంజూరు చేస్తు న్నట్టు ప్రకటించారు. నందిపేట, మాక్లూర్ మండలాల్లో డబుల్ బెడ్‌రూంల నిర్మా ణాలను ప్రారంభించలేదు.

మూడు గ్రామాల్లోనే..

ఆర్మూర్ మండలంలోని మూడు గ్రామాల్లోనే రెండు పడక గదుల నిర్మాణాలను ప్రారంభించారు. ఆర్మూర్ పట్టణంతో పాటు పెర్కిట్, అంకాపూర్ గ్రామాలలో డబుల్ బెడ్‌రూంల ఇళ్ళ నిర్మాణాలను ప్రారంభించారు. ఆర్మూర్ పట్టణంలో 160రెండు పడక గదుల నిర్మాణాలకు శ్రీకారం చుట్టగా, అందులో 136ఇళ్లు దాదాపు పూర్తి కావొచ్చింది. కొంత మేరకు మౌళిక వసతులు కల్పించాల్సి ఉంది. ఇంటర్నల్ రోడ్లు, విద్యుత్ సౌకర్యం, సీసీరోడ్లు, ఇతర మౌలిక వసతులు పూర్తి చేయాల్సి ఉంది. అంకాపూర్ గ్రా మంలో 165ఇళ్లు నిర్మించాలని సంకల్పించి పనులు ప్రారంభించగా 112ఇళ్లు వివిధ ధశల్లో ఉన్నాయి. ఇక్కడ సీసీరోడ్లు నిర్మించి డ్రైనేజీ పనులు చేపడుతున్నారు. పెర్కిట్ లో వంద ఇళ్ల నిర్మాణం ప్రారంభించగా ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యి చిన్నపాటి పనులు పూర్తి చేయాల్సి ఉంది.

అర్హులైన వారికే ఇళ్ల మంజూరు..

ఆర్మూర్ పట్టణంతో పాటు అంకాపూర్, పెర్కిట్ గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న రెండు పడక గదుల ఇళ్ళను అర్హులైన వారికే అందజేయాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి పట్టుదలతో ఉన్నారు. నిర్మాణంలో ఉన్న రెండు పడక గదుల ఇళ్ళను ఇటీవల పరిశీలించిన ఎమ్మెల్యే రాజకీయాలకు అతీతంగా నీజమైన లబ్ధిదారులకే ఇళ్లు కేటాయించాలని అధికారులకు సూచించారు. గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేసి పారదర్శకంగా ఇళ్ళు కేటాయించాలని అధికారులను ఆదేశించారు. దీంతో డబుల్ బెడ్‌రూం నిజమైన లబ్ధిదారులకే అందుతాయని ప్రజలు విశ్వసిస్తున్నారు.

దరఖాస్తు చేసుకున్న వారి ఎదురుచూపులు..

ఆర్మూర్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఏళ్ళ తరబడి ఎదురుచూస్తున్నారు. వారికి సొంతింటి కల ఎప్పుడు నెరవేరుతుందోనని ఆశతో ఉన్నారు. రేండేళ్ల క్రితం డబుల్‌బెడ్‌రూంల మంజూరుకు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు, నాయకులు సూచించడంతో గ్రా మా ల్లో లబ్ధిదారులు అధిక సంఖ్యలో డబుల్ బెడ్‌రూంలకు దరఖాస్తు చేసుకున్నారు. ని యోజక వర్గంలోని మూడు గ్రామాల్లోనే పనులు ప్రారంభించినప్పటికీ సొంతింటి కల నేరవేరుతుందన్న ఆశతో ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభు త్వం అధికారం చేపట్టింది. ఎన్నికల మెనిఫెస్టోలో అర్హులైన పేదలకు ఇంటి నిర్మా ణాలకు రూ.5 లక్షలు అందజేస్తామని హామీ ఇచ్చింది. ఇందిరమ్మ ఇళ్ల పేరిట ఇళ్లు లేని వారికి ఇంటి స్థలంతో పాటు రూ.5లక్షలు ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు.. దీంతో రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలు కొత్తవి ప్రారంభించేందుకు ఆస్కారం లేదు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఇళ్లనే లబ్ధిదారులకు కేటాయించాల్సి ఉంటుంది. ప్రస్తుత ప్రభుత్వం సొంత స్థలం ఉన్నవారికి ఇళ్లు నిర్మించుకోవడానికి రూ.5లక్షలు అందజేయనున్న దృష్ట్యా ఇంటి స్థలం ఉన్నవారు దరఖాస్తులు చేసుకోగా గ్రామాల్లో చాలామంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరయ్యాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్లు నిర్మిస్తే లబ్ధిదారులకు దశలవారీగా రూ. 5లక్షలు అందజేయనున్నారు. కొత్త ప్రభుత్వంలోనైనా తమ సొంతింటి కల సాకారానికి మోక్షం లభిస్తుందని లబ్ధిదారులు ఆశాభావంతో ఉన్నారు.

స్నాతకోత్సవం లోగా..
బాలికల హాస్టల్‌కు శంకుస్థాపన జరిగేనా?

● జూలైలో టీయూ స్నాతకోత్సవం ● గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరయ్యే అవకాశం

డిచ్‌పల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అవతరణకు ముందే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం పేరుతో ఉన్న ఏకైక యూనివర్సిటీ డిచ్‌పల్లి తెలంగాణ యూనివర్సిటీ. ఇంత ఘనమైన పేరున్న ఈ విశ్వవిద్యాలయంలో బాలికలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రం అవతరించి 11ఏళ్ల గడిచినా వర్సిటీలో బాలికల వసతి సమస్య నేటికి తీరడం లేదు ఎన్నో సార్లు ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు, రాష్ట్ర గవర్నర్‌కు వినతి పత్రాలు విద్యార్థులు అందించిన సమస్య పరిష్కారం కావడం లేదు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి విద్యార్థి నులు ఇక్క డికి పీజీ, ఉన్నత చదువుల కోసం వస్తుంటారు. 8 ఏళ్ల కాలంగా ఈ హాస్టల్ సమస్య తీవ్రంగా వేధిస్తున్న ప్రభుత్వ, పెద్దలు, ఉన్నత విద్యా మండలి స్పందించకపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. పీజీ కోర్సుల్లో అన్ని విభాగాల్లో విద్యార్థినులే అధిక శాతం సీట్లు పొందగా 100శాతం సీట్లలో 72మంది విద్యార్థినులే సీట్లు సాధిస్తున్నారని వర్సిటీ అధికారులే చెబుతున్నారు. వర్సిటీలోని బాలికల హాస్టల్ లోని ఒక్కో గదిలో 5నుంచి 6గురు ఉండాల్సి ఉండగా 10 నుంచి 15 మంది సర్దుబాటు చేసుకుం టున్నారు. తెలంగాణ యూనివర్సిటీలో 1851 మంది విద్యార్థులు పీజీ కోర్సుల్లో చేరగా అందులో 1226మంది బాలికలు పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందారు. గతంలో ఏన్నడు లేని విధంగా పీజీ కోర్సుల్లో బాలికలు ఎక్కువగా చేరుతుండటంతో హాస్టల్ అకామిడేషన్ ఇబ్బందిగా మారుతుంది. దీంతో యూనివర్సిటీ అధికారులు సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల్లో చేరే విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించకుండా ఒత్తిడిని తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. పదేళ్ల క్రితం 300 మంది కోసం నిర్మించిన బాలికల హాస్టల్‌లో ప్రస్తుతం 500 మంది ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కెమిస్ట్రీ, తెలుగు, ఇతర డిపార్టుమెంట్‌లలో 30 నుంచి 60 సీట్లకు పెంచిన హాస్టల్ వసతి మాత్రం పెంచడం లేదని దీంతో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని విద్యార్థినులు వాపోతున్నారు. గతంలో విశ్వ విద్యాలయానికి గవర్నర్ హోదాలో తమిళిసై సౌందర రాజన్ సందర్శించి సమయంలో విద్యార్థులు బాలికల హాస్టల్ ఏర్పాటు చేయాలని ఆమెకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. వెంటనే సమస్య పరిష్కరించేందుకు స్వయంగా హాస్టల్ సందర్శించిన గవర్నర్ హామీ ఇచ్చి రెండు ఏళ్లు గడిచినా ఇంత వరకు హాస్టల్ వసతి నిర్మాణానికి ముందడుగు పడక పోవడంతో విద్యార్థినులకు సమస్యలు అధికమయ్యాయి. కావున ఇప్పటికైనా జిల్లా శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు, పార్ల మెంట్ సభ్యుడు వసతి గృహం ఏర్పాటు పట్ల ప్రత్యేక చొరవ చూపా లని విద్యార్థినులు కోరుతున్నారు.


టీయూ స్వాగత తోరణం


టీయూ బాలికల హాస్టల్ ఇదే..

పనులు పూర్తయినా ప్రారంభం కాని వైనం

తెలంగాణ యూనివర్సిటీకి కేంద్ర ప్రభుత్వం రూసా ద్వారా బాలికల హాస్టల్ మంజూరు అయిందని వర్సిటీ అధికారులు చెబుతున్నా ఇంతవరకు పనులు ప్రారంభం కావడం లేదు. గత టీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ డిపార్టుమెంట్ల ద్వారా వర్సిటీకి రెండు బాలికల హాస్టల్ మంజూరయ్యాయి అందుకు సంబంధించి మంజూరు పత్రాలను ప్రస్తుతం రిజిస్ట్రార్‌గా ఉన్న యాదగిరి నాటి మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ చేతుల మీదుగా రవీంద్ర భారతిలో అందుకున్నారు. ఆ ఫైల్ ఎటు పోయిందో ఉన్నతాధికారులకే తెలియాలి.

స్నాతకోత్సవానికి గవర్నర్ హాజరయ్యే అవకాశం?

తెలంగాణ యూనివర్సిటీ రెండవ స్నాత కోత్సవం జూలైలో జరిగే అవకాశం ఉంది అందులో భాగంగా ఇటీవల వైస్ చాన్స్‌లర్ యాదగిరి రావు, గవర్నర్ ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆ లోపైనా తెలంగాణ యూనివర్సిటీలో బాలికల హాస్టల్‌కు శంకుస్థాన చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

అపూర్వం విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


అర్గుల్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు


పల్లికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

జక్రాన్‌పల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్గుల్ గ్రామంలో మైత్రి గార్డెన్‌లో ఆదివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2004-25 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరుపు కున్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకొని నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పల్లికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

భీమ్‌గల్ రూరల్: భీమ్‌గల్ మండలంలోని పల్లికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2002-2003 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. 22 ఏళ్ల తర్వాత తమ కుటుంబ సభ్యులతో సహ సమ్మేళనానికి హాజరై అనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా తమకు చదువు నేర్పిన ఉపాధ్యాయులు శాంబ శివ రావ్, రాజేందర్, బాల్‌రాజ్, ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రభాకర్, శంకర్, సదానందం, ఈశ్వర్, శ్రీనివాస్, కృష్ణ, శేఖర్, గంగాధర్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ప్రసాద్, సదా, శ్రీకాంత్, సుమన్, సయ్యద్ అజారుద్దిన్, గంగప్రసాద్, నరేష్, శివానంద్, రజిత, స్వప్న, సునిత, తదితరులు పాల్గొన్నారు.

ముల్లంగిలో బోనాల ఊరేగింపు


ముల్లంగిలో మహాలక్ష్మీ ఆలయంలో బోనాలు సమర్పిస్తున్న మహిళలు

డిచ్‌పల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముల్లంగి(ఐ)లో ఆదివారం వీడీసీ ఆధ్వర్యంలో గ్రామం లో ఈ ఏడాది పాడి పంటలు సమృద్ధిగా పండాలని చెరువులు నిండాలని ప్రార్థిస్తు మహాలక్ష్మీ ఆలయంలో పెద్ద ఎత్తున మహిళలు బోనాలు నేవేథ్యాలు అమ్మవారికి సమర్పించుకున్నారు. గ్రామ దేవతలకు ఊరేగింపు నిర్వహించి ప్రతిష్ఠింపజేశారు. బోనాలు ఊరేగింపు చేశారు. అనంతరం కొబ్బరి కాయలు కొట్టారు. ఈ కార్య క్రమంలో మహిళలు, యువకులు, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని గ్రామ దేవతలకు జలాభిషేకం

ఆర్మూర్ టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సర్వసమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం కులసంఘ సభ్యులు గ్రామదేవతలకు జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం రాత్రి సంఘ సభ్యులు గోదావరి నీటి జలాలకోసం పోచంపాడ్‌కు బయల్దేరి వేకువజామున గోదావరి జలాలు తీసుకువచ్చారు. వారిని ఊరి పొలిమేర నుంచి సర్వసమాజ్ సభ్యులు, కులసంఘ సభ్యులు డప్పు వాయిద్యాలతో స్వాగతం పలికి గ్రామ దేవతలకు జలాభిషేం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్వసమాజ్ ప్రజాఐక్య సమితి అధ్యక్షుడు కొట్టాల సుమన్, కార్యదర్శి కర్తన్ దినేష్, కోశాధికారి బక్కొల్ల రవి, సదర్‌క్యాషియర్లు తెడ్డు బాల్‌రెడ్డి, గుండ సాయన్న, సదార్లు పుప్పాల గిరి, గోర్త దేవేందర్, లోక దశరత్, గుండ బాజన్న, సర్వసమాజ్ సభ్యులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: ఈసారి కూడా పుష్కలంగా వర్షా లు కురిసి చెరువులు నిండి పంటలు పండాలని వరుణ దేవుడిని వేడు కుంటూ మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవతలకు గంగనీళ్లతో జలాభిషేం చేశారు. తొర్లికొండలో గంగనీళ్లను ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామదేవతలకు జలాభిషేకం చేశారు. వివిధ గ్రామాలలో గంగ నీళ్లతో గ్రామదేవతలకు జలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్రాను. అనంతరం గ్రామాలలో ప్రజలు వనబోజనాలకు వెళ్లారు.

నాగంపేట్‌లో..

ముప్కాల్: మండలంలోని నాగంపేట, రెంజర్ల గ్రామాలలో ఆదివారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామదేతలకు గంగనీళ్లతో అభిషేకం నిర్వమించారు. గ్రామస్థులు ఉదయం గోదావరి నుంచి గంగజలాన్ని తీసుకువచ్చి గ్రామశివారు నుంచి వలగొడుగు, డప్పు వాయిద్యాలతో గంగా జలాలను గ్రామవీధుల గుండా ఊరేగించారు. గ్రామంలోని అన్ని గ్రామ దేవత విగ్రహాలను గంగాజలాలతో అభిషేకం చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండి అందరు ఆరోగ్యంగా ఉండాలని గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు.


ఆర్మూర్‌లో గోదావరి గంగజలాలను తీసుకువచ్చిన పలు కులస్థులు


తొర్లికొండలో..


గోదావరి నుంచి గంగజలాలను తీసుకువస్తున్న గ్రామస్థులు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

● కార్మిక సంఘాల జేఏసీ

నిజామాబాద్ కల్చరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ జూలై 9న కార్మిక సంఘాలు నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక సంఘాల జేఏసీ పిలుపునిచ్చింది. ఆదివారం జిల్లా కేంద్రంలోని కోటగల్లిలోగల ఎన్ఆర్ భవన్‌లో జరిగిన టీయూసీఐ, ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశంలో టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఓమయ్య, సీఐటీయూ కార్యదర్శి నూర్జహాన్, ఐఎఫ్‌టీయూ అధ్యక్షుడు భూమయ్యలు ఈ మేరకు నాయకులు తీర్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 11 సంవత్సరాలుగా నరేంద్ర మోదీ కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ కార్మిక జీవన ప్రమాణాలను పడిపోయే స్థాయికి తీసుకువస్తున్నారని అన్నారు. అన్ని రకాల వస్తువుల ధరలు పెరిగాయని కానీ కార్మికుల వేతనాలు పెరగడం లేదని అన్నారు. ఉద్యోగ ఆరోగ్య భద్రత కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజాసంఘాలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జూలై 9న సార్వత్రిక సమ్మెను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కనీస పెన్షన్ అమలు, కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్‌లు, పనిగంటల పెంపుదల వంటి అంశాలను ఎజెండాగా తీసుకొని దేశవ్యాప్త సమ్మెను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని కార్మిక సంఘాలు సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేందర్, మొయినొద్దీన్, భూమేష్, ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై కొట్టాడంటూ సీపీ కార్యాలయం ఎదుట ఆందోళన

నిజామాబాద్ అర్బన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): భీంగల్ ఎస్సై, కానిస్టేబుళ్లు తనను కొట్టారని భీంగల్ మండలం రూప్లా తండాకు చెందిన గుగులోత్ బీను ఆదివారం జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. బాధితుడు బీను చెప్పిన వివరాల ప్రకారం.. ఇంటి నిర్మాణం విషయంలో శనివారం తనకు, తన కుమారుడి మధ్య గొడవ జరగగా తన కుమారుడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లాడని తెలిపాడు. తన కుమారుడు వెళ్లిన కొద్దిసేపటికి తాను కూడా పోలీస్ స్టేషన్‌కు వెళ్లానని ఈ క్రమంలో ఎస్సైతో పాటు కానిస్టేబుళ్లు తనను తీవ్రంగా కొట్టినట్లు బీను తెలిపాడు. పోలీస్ స్టేషన్‌లో లాఠీలతో కొట్టి వదిలేశారని తర్వాత తాను ఆర్మూర్ వెళ్లి చికిత్స చేయించుకున్నట్లు తెలిపారు. సీపీ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగిన బీనుతో స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీశైలం మాట్లాడారు. దీంతో బాధితుడు తనకు న్యాయం చేయాలని బాధితుడు ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

నగర యాదవ సంఘం అధ్యక్షుడిగా విక్కీ యాదవ్



ఎన్నికైన నూతన కార్యవర్గం

నిజామాబాద్ అర్బన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నగర యాదవ సంఘం అధ్యక్షుడిగా విక్కీ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నగరంలోని ఇందిరాపూర్ కాలనీలోని సంఘ భవనంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన నగర అధ్యక్షుడిగా విక్కీ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా దేవేందర్ యాదవ్, గౌరవ అధ్యక్షులుగా హన్మంత్ యాదవ్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా విక్కీ యాదవ్ మాట్లాడుతూ తమ పై నమ్మకంతో నగర యాదవ కులస్తులంతా ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజుల్లో నగర యాదవ సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన అన్నారు.

గౌడ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



గౌడ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ప్రతినిధులు

నిజామాబాద్ అర్బన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): గౌడ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించి భవిష్యత్తులో ఉన్నత స్థానంలో నిలవాలని గౌడ అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బండి సాయన్నగౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్‌లు పిలుపునిచ్చారు. గోపా జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో 10వ తరగతి, ఇంటర్మీడియెట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన గౌడ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గౌడ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని అన్ని విధాలుగా గోపా సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ గౌడ్ హాస్టల్ అధ్యక్షుడు మోతె చక్రవర్తిగౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మారయ్యగౌడ్, పట్టణ గౌడ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, రవీందర్‌గౌడ్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విపుల్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

'మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి'

ధర్పల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరిట కొనసాగిస్తున్న హత్యాకాండను వెంటనే ఆపాలని, కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టులతో బేషరతుగా శాంతి చర్చలు జరపాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ భీంగల్ సబ్ డివిజన్ కార్యదర్శి బాలయ్య, ఏఐకేఎంఎస్ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి మార్క్సులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు మండల కేంద్రంలో మాట్లాడుతూ.. మావోయిస్టుల అణచివేత పేరిట ప్రారంభించిన యుద్ధం ఆదివాసులతో పాటు మావోయిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తల హత్యాకాండలో 540 మందికి పైగా ఉన్నారని అన్నారు. అభివృద్ధి పేరిట రాజ్యాంగం చట్టాలలో పేర్కొన్న ఆదివాసుల హక్కులను కాలరాసి అక్కడి ప్రకృతి వనరుల ఖనిజ సంపదను స్వదేశీ, విదేశీ కార్పొరేట్లకు దారాదత్తం చేయడానికే ఈ హత్యాకాండను కేంద్రం కొనసాగిస్తున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు. కర్రెగుట్టల ప్రాంతాన్ని వేలాది మంది సాయుధ బలగాలు చుట్టుముట్టి 31 మందిని మట్టు పెట్టినట్లుగా ప్రకటించారని చనిపోయిన వారి వివరాలు వెల్లడించడం గానీ అన్ని శవాలను వారి కుటుంబాలకు అప్పగించడం కాని జరగలేదని అన్నారు. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి కేశవరావును పట్టుకొని హత్య చేయడమేకాక అతని శవాన్ని సైతం వారి కుటుంబీకులకు ఇవ్వడానికి నిరాకరించారని వారు పేర్కొన్నారు. ఇది అత్యంత దుర్మార్గమైన విషయమని వారు అన్నారు. తక్షణమే ఆపరేషన్ కగార్ నిలిపివేస్తూ శాంతి చర్చలు కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. వెంటనే శాంతి చర్చలు కొనసాగించాలన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదివి ఫలితాలు సాధించాలి

● పోలీసు కమిషనర్ సాయిచైతన్య



విద్యార్థులకు చెక్కులను అందజేస్తున్న సీపీ సాయిచైతన్య

నిజామాబాద్ అర్బన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కృషితో నాస్తి దుర్భిక్షం అనే విషయాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని పోలీసు కమిషనర్ సాయిచైతన్య పిలుపునిచ్చారు. ఎంఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 10వ తరగతి, ఇంటర్మీడియెట్ తరగతుల్లో అత్యుత్తమ ప్రతిభ సాధించిన రాష్ట్రంలోని 11 జిల్లాల నుంచి వచ్చిన 200కు పైగా విద్యార్థులకు 10వేల రూపాయల చెక్కులను అందజేశారు. నగరంలోని బస్వాగార్డెన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సీపీ మాట్లాడుతూ.. జీవితంలో ప్రతి ఒక్కరూ ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ఆ లక్ష్య సాధనకు కష్టపడి ముందుకు సాగితే ఫలితం దక్కుతుందన్నారు. ఆర్థిక స్థితిగతుల మీద కాకుండా కష్టపడి చదివినందున ఈరోజు ఎంఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా రూ.10వేల చెక్కులకు తాము అర్హులమనే విషయాన్ని విద్యార్థులు గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ సాంబశివారెడ్డి, డైరెక్టర్లు ధనూష్‌రెడ్డి, రాజరెడ్డి, అబ్బాపూర్ రవి, తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శుల నియామకం



నియామక పత్రం అందుకుంటున్న దృశ్యం

సుభాష్‌నగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా అజ్మత్‌ఖాన్, వినోద్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం డీఎస్ఏ స్విమ్మింగ్ పూల్ మైదానంలో ఏర్పాటు చేసిన తైక్వాండో అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి మీర్ వహజ్ అలీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎఫైర్స్ తమ సంఘానికి గుర్తింపు ఇచ్చిందని తెలిపారు. జిల్లా నుంచి ఐదు సంవత్సరాలుగా ఎంతో మంది క్రీడాకారులను తైక్వాండో క్రీడా రంగంలో ప్రోత్సహించి వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దామన్నారు. అదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జిల్లా క్రీడాకారులను తీర్చిదిద్దాలని నూతన కార్యవర్గానికి సూచించారు. తైక్వాండో క్రీడారంగ అభివృద్ధి కోసం తమవంతు సహాయ సహకారాలను జిల్లా అసోసియేషన్‌కు ఎల్లవేళలా అందిస్తామన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి నియామకపత్రాలను అందజేసి కార్యవర్గాన్ని శాలువాతో సత్కరించి అభినందించారు. నూతన కార్యవర్గంలో చైర్మన్‌గా డాక్టర్ రమేష్‌పవార్, కోశాధికారిగా వినోద్, ఉపాధ్యక్షులుగా వాగ్మేరే సుభాష్, శ్యామ్, మంజునాథ్, వినోద్‌రెడ్డి, రాము, సంయుక్త, కార్యదర్శులుగా ప్రశాంత్‌కుమార్, బుచ్చన్న, మురళి, వినోద్, ప్రవీణ్, సంతోష్‌లు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా ఫుట్‌బాల్ కోచ్ నాగరాజు వ్యవహరించారు. ఒలంపిక్ అసోసియేషన్ అబ్జర్వర్‌గా అబ్దుల్ ఉమర్‌లు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో నెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేశ్వర్‌రావు, వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జైపాల్, తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరి భీమన్‌కు నివాళులు



టంగుటూరి భీమన్ మాస్టర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నిజామాబాద్ కల్చరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఇందూరు నగరాలు అభినయ రారాజు టంగుటూరి భీమన్ మాస్టర్‌కు నృత్య కళాకారులు నివాళులర్పించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ద్వారకానగర్‌లోగల భీమన్ నృత్య నికేతన్‌లో ఆయన వర్ధంతిని పురస్కరించుకొని చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన కళాసేవలను శిష్యులు గుర్తు చేసుకున్నారు. అనంతరం పలు వీధుల్లోని నిర్వాసితులకు అన్న ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో భీమన్ నృత్యనికేతన్ స్థాపకుడు రాజేష్, ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు సాయిబాబు, డ్యాన్స్ మాస్టర్‌లు వినయ్, అమృత్, సతీష్, శ్రీనివాస్‌రెడ్డి, జానపద గాయకుడు నవీన్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఉమ్మడి జిల్లాకు చెందిన పోలీసు కానిస్టేబుళ్లు

పోలీసు కానిస్టేబుళ్ల ఆత్మీయ సమ్మేళనం

నిజామాబాద్ అర్బన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన పోలీసు కానిస్టేబుళ్లు 25 సంవత్సరాల సర్వీసు పూర్తిచేసుకున్న సందర్భంగా నగరంలో అపూర్వ సమ్మేళనాన్ని నిర్వహించారు. 2000 సంవత్సరానికి చెందిన పోలీసు సిబ్బంది అంతా ఒక్కచోట చేరి ఆదివారం సందడి చేశారు. నగరంలోని వంశీ ఇంటర్నేషనల్ హోటల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాకు చెందిన కానిస్టేబుళ్లు పాల్గొని తమ సర్వీసులో సాధించిన విజయాలు, శిక్షణ సందర్భంగా చోటుచేసుకున్న జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు.

జాతీయ కబడ్డీ క్రీడాకారుడికి నివాళులు



నివాళులర్పిస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ కబడ్డీ క్రీడాకారుడు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సుబ్బారావుకు ఘనంగా నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని సుబ్బారావు స్వగృహంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి జిల్లా కబడ్డీ అసోసియేషన్ సభ్యులు నివాళులర్పించారు. సుబ్బారావు చనిపోవడం కబడ్డీ క్రీడకు తీరని లోటని అన్నారు. అసోసియేషన్‌లోనే కాకుండా ఏ క్రీడ జరిగిన విజయవంతం చేయడంలో సుబ్బారావు తనదైన పాత్ర పోషించేవాడని అన్నారు. సుబ్బారావు ఆత్మశాంతి చేకూర్చాలని భగవంతుని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు లింగయ్య, గంగాధర్, సాయాగౌడ్, మచ్చేందర్, నర్సయ్య, కిషన్‌రెడ్డి, గంగారెడ్డి, నర్సారెడ్డి, జగన్మోహన్, రాజేందర్, లింబారెడ్డి, కబడ్డీ కోచ్ ప్రశాంత్, సాయిలు, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

సీఐని సన్మానించిన బీజేపీ మండల నాయకులు

డిచ్‌పల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన వినోద్ రెడ్డిని ఆదివారం బీజేపీ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పానుగంటి సతీశ్‌రెడ్డి సీఐకి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రకాంత్, మాజీ వైస్ ఎంపీపీ శ్యాంరావు, సతీశ్‌రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు రవి పాల్గొన్నారు.

రైతు నేస్తం కార్యక్రమంలో రైతులు పాల్గొనాలి

● వ్యవసాయ అధికారి సుధా మాధురి

డిచ్‌పల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రైతు నేస్తం కార్యక్రమంలో మండలంలోని రైతులు పాల్గొనాలని వ్యవసాయ అధికారి సుధా మాధురి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా రైతు నేస్తం కింద యూనిట్లను మంజూరు చేసిందని, సోమవారం మధ్యాహ్నం 3గంటలకు సీఎం రేవంత్ రెడ్డి, ప్రొ.జయశంకర్ వర్సిటీ రాజేందర్‌నగర్‌లో ఆ యూనిట్లను లాంచనంగా ప్రారంభిస్తారని తెలిపారు. ఇందుకు నడిపల్లి, యానంపల్లి, మెంట్రాజ్‌పల్లి రైతు వేదికల్లో ప్రసార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆమె కోరారు.

రైతులకు మేలు చేసే విధంగా అమలు చేయాలి

నిజామాబాద్ కల్చరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పత్తి కొనుగోలు అవలంబిస్తున్న వాటిపై ప్రత్యేకమైన ప్రణాళికతో కొనుగోలు చేసి రైతులకు ఉపయోగపడే విధంగా చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. పత్తి కొనుగోలులో ఆదిలాబాద్ జిల్లాలో, మధ్యప్రదేశ్‌లో మోదీ ప్రభుత్వం 8 ప్రధాన పంటలకు వర్తింపజేసి విఫలమైన ధర వ్యత్యాసాన్ని చెల్లింపు పథకంను తెలంగాణ రాష్ట్రంలో పత్తి ఎక్కువ పండే ఆదిలాబాద్ జిల్లాలో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టడాన్ని ఆపాలని రైతులకు మేలు చేసే విధంగా రూపొందించాలని డిమాండ్ చేశారు. రైతు పంటలకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధరకు రైతుల నుండి ప్రభుత్వం కొనుగోలు చేయకుండా తప్పుకొని మార్కెట్ శక్తులకు రైతును బలిచేసే చర్య ఉండకూడదని అన్నారు. ఈ విధానాన్ని అఖిల భారత ఐక్య రైతు సంఘం గతంలోనే స్పష్టం చేసిందని అందువల్ల రైతులు సంఘటితంగా వ్యతిరేకించాలని కోరారు.

ఎస్సారెస్పీపైనే రైతుల ఆశలు

(ఐదో పేజీ తరువాయి)

నాట్లు వేసేందుకు ఏర్పాట్లను చేసుకుంటున్నారు. ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో నారుమళ్లను సిద్ధం చేసుకుంటున్నారు. ప్రాజెక్టులోకి ప్రతీ సంవత్సరం జూన్ చివరి నుంచి వరద మొదలై ఆగస్టులోపు నిండుతుండటంతో ఈ సంవత్సరం కూడా అదే రీతిలో పంటలు వేసేందుకు ఏర్పాట్లను చేసుకుంటున్నారు. ఎస్సారెస్పీ పరిధిలో ఎక్కువగా వరినాట్లు జూలై నెలలో వేస్తారు. కాల్వల నుంచి వచ్చే నీళ్లతో పాటు బావుల కింద వర్షాల ఆధారంగా సాగు చేస్తారు. జూలై మూడవ వారం నుంచి ప్రతీ సంవత్సరం ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తుండటంతో ఈ దఫా కూడా అదే రీతిలో పంటలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. నారుమళ్లను సిద్ధం చేసుకుంటున్న రైతులు వరినాట్లకు అవసరమైన ఎరువులను కూడా సమకూర్చుకుంటున్నారు. ఎస్సారెస్పీ నుంచి వచ్చే వరద ఆధారంగా నీటిని ఆయకట్టుకు మళ్లించడంతో పాటు ఎక్కువ వచ్చిన వరదను గేట్ల ద్వారా ప్రతీ సంవత్సరం దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ దఫా కూడా అదే రీతిలో ఈ నీటిని అందిస్తారని అంచనాకు వచ్చిన రైతులు ఈ ఏర్పాట్లను చేసుకుంటున్నారు. ఎస్సారెస్పీ ఎగువన ఇంకా భారీ వర్షాలు పడకపోవడంతో పూర్తిస్థాయిలో ప్రాజెక్టులోకి వరద మొదలు కాలేదు. భారీ వర్షాలు ప్రాజెక్టు ఎగువ ప్రాంతమైన మహారాష్ట్రలో వర్షాలు పడితే గోదావరి ద్వారా ఈ వరద రానుంది. ప్రతీ సంవత్సరం ఆగస్టు నెలలో పూర్తిస్థాయిలో ప్రాజెక్టు నిండుతుంది. వర్షాలు మొదలు కావడంతో ఎస్సారెస్పీ అధికారులు కూడా అన్ని ఏర్పాట్లను చేసుకుంటున్నారు. గేట్ల మరమ్మతులను పూర్తి చేసిన అధికారులు వరదలు వస్తే ఆయకట్టుకు కూడా సాగునీరు అందించేందుకు సిద్ధమవుతున్నారు. ఎస్సారెస్పీ ద్వారా ప్రతీ సంవత్సరం పంటలకు సాగునీరు అందిస్తున్నామని ఎస్ఈ శ్రీనివాస్‌గుప్త తెలిపారు. ప్రాజెక్టుకు వచ్చే నీటి ఆధారంగా పంటలకు సాగునీరు అందిస్తామన్నారు. రాష్ట్రస్థాయిలో తీసుకునే నిర్ణయం ఆధారంగా ఈ నీటి విడుదల ఉంటుందని ఆయన తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కొరత

(ఐదో పేజీ తరువాయి)

అయ్యాయి. ఇందులో 454 బేస్‌మెట్ లెవల్‌లో ఉండగా 60 గోడల స్థాయిలో ఉన్నాయి. అర్బన్‌లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. కేవలం ఒక్క ఇల్లు మాత్రమే గ్రౌండింగ్ అయినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

ఇసుక కొరతతో లబ్ధిదారుల ఇబ్బందులు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పాటు సామాన్యుడు ఇళ్ల నిర్మాణం చేసుకోవాలంటే ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది. జిల్లాలో ఇసుక కొరత ఉండటంతో ఇళ్ల నిర్మాణం మందకొడిగా సాగుతుంది. బోధన్, బాన్సువాడ, బాల్కొండ నియోజకవర్గాల పరిధిలో వాగులు, గోదావరి, మంజీరా వంటి నదులు ఉన్నప్పటికీ అక్కడి నుంచి నిజామాబాద్, ఆర్మూర్ వంటి ప్రాంతాలకు ఇసుక తీసుకురావడం ఇబ్బందికరంగా ఉంటుంది. కాళేశ్వరం నుంచి ఇసుక తెచ్చేవారు సిండికేటై బోధన్, బాన్సువాడ ప్రాంతాల నుంచి ఇసుక తీసుకురాకుండా అడ్డుపడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నిజామాబాద్ పట్టణంతో పాటు ఆర్మూర్, నందిపేట్, డిచ్‌పల్లి, తదితర ప్రాంతాలలో ఇళ్ల నిర్మాణం చేయాలంటే ఇసుక దొరకని పరిస్థితి ఉంది. వేలాది రూపాయలు ఇసుకకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉండటంతో ఇళ్ల నిర్మాణం చేయాలనుకుంటున్న పేదలు, మధ్యతరగతి వారు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం నుంచి ఇసుక పాయింట్ లేకపోవడం ప్రభుత్వ అవసరాలతో పాటు ప్రభుత్వ పథకాలకు, సామాన్యులకు ఇబ్బందికరంగా ఉంటుంది. కొన్ని గ్రామాలలో వాగుల ద్వారా ఇసుక తీసుకునే అవకాశం ఉన్నా ఆ గ్రామాలలో కట్టుదిట్టమైన నిబంధనలతో ఇసుక తీసుకునే పరిస్థితి ఉండటం లేదు.

వర్షాకాలం కష్టమే...

ఇప్పటికే నెలరోజుల ముందే వర్షాకాలం మొదలు కావడంతో జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం దాదాపు నిలిచిపోయింది. భారీ వర్షాలు కురుస్తుండటంతో ఇళ్లు కట్టుకోవడం ఇబ్బందికరంగా మారుతుంది. ఇప్పటికే భూమిపూజలు చేసిన వారు వర్షాకాలం ముగిసిన తర్వాత ఇంటి నిర్మాణం ప్రారంభించాలని ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే ఇళ్ల నిర్మాణం ప్రారంభించిన వారు వాటిని పూర్తి చేసేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు అధికంగా కురిస్తే ఇసుక సేకరణ కూడా ఇబ్బందికరంగా మారే అవకాశాలు ఉన్నాయి. అధికారులు సైతం వీలైనంత తొందరగా ఇసుక సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నా జిల్లాలో ఇసుక దొరకని పరిస్థితి ఉంది. మరో మూడు నాలుగు నెలల తర్వాతనే ఇళ్ల నిర్మాణం వేగవంతమయ్యే అవకాశాలు ఉన్నాయి.

హోరా హోరీగా రెండో రోజూ క్రికెట్ పోటీలు



సెంచరీ చేసిన అభినవ్

సుభాష్‌నగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ప్రాబబుల్స్ ఎంపిక పోటీలు రెండవ రోజు హోరాహోరీగా కొనసాగాయి. నగరంలోని ఓ ప్రైవేటు మైదానంలో ఆదివారం గ్రీన్ వర్సెస్ రెడ్‌ల మధ్య పోటీ జరిగింది. గ్రీన్ జట్టు టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ దిగిన గ్రీన్ జట్టులో అభినవ్ 87 బాల్స్‌లో 18 ఫోర్‌లు, 1 సిక్స్‌తో 106 పరుగులు చేశాడు. గ్రీన్ జట్టు మొత్తం 252 పరుగులు చేసి 10 వికెట్‌లను కోల్పోయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రెడ్ జట్టు పోరాడి కేవలం 4 పరుగుల తేడాతో ఓడిపోయింది. రెడ్ జట్టులో రేవంత్ 62 పరుగులు, అఖిల్ 50 పరుగులు చేశాడు. గ్రీన్ జట్టు బౌలర్ సిద్దు 3 వికెట్లు తీశాడు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.115	రూ.200	రూ. 230
వెన్‌కాబ్(కిలో)	రూ.120	రూ.210	రూ. 240

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.99,000	రూ.91,000	రూ.1080

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : హౌటూ ట్రేయిన్ యువర్ డ్రాగెన్ (తెలుగు 3డి) (11.00, 1.45, 4.30)
: హౌటూ ట్రేయిన్ యువర్ డ్రాగెన్ (ఇంగ్లీష్ 3డి) (7.15, 10.00)
స్క్రీన్-2 : హౌజ్‌ఫుల్-5 (హిందీ) (10.10, 4.25)
: ఫ్రమ్ ది వరల్డ్ ఆఫ్ జాన్‌వీక్ (తెలుగు) (1.40)
: ఫ్రమ్ ది వరల్డ్ ఆఫ్ జాన్‌వీక్ (ఇంగ్లీష్) (7.55, 10.40)
స్క్రీన్-3 : అందాల రాక్షసి (10.40)
: ఫైనల్ డిస్టనేషన్ బ్లడ్ లైన్స్ (తెలుగు) (1.50)
: ఫ్రమ్ ది వరల్డ్ ఆఫ్ జాన్‌వీక్ (తెలుగు) (4.20)
: హౌజ్‌ఫుల్-5 (హిందీ) (7.05, 10.35)
స్క్రీన్-4 : ఫ్రమ్ ది వరల్డ్ ఆఫ్ జాన్‌వీక్ (తెలుగు) (10.50)
: అందాల రాక్షసి (1.35, 7.35, 10.45)
: ఫైనల్ డిస్టనేషన్ బ్లడ్ లైన్స్ (తెలుగు) (5.00)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : తొలిప్రేమ (11.00, 1.30, 4.30, 7.30, 10.30)
స్క్రీన్-2 : అందాల రాక్షసి (11.00, 4.30)
: హౌజ్‌ఫుల్-5 (హిందీ) (1.35, 7.30, 10.30)
స్క్రీన్-3 : అందాల రాక్షసి (10.20)

దేవి : తొలిప్రేమ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : అందాల రాక్షసి (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : హౌజ్‌ఫుల్-5 (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్